క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి జొన్నాడ విద్యార్థులు




పి.భానుప్రకాష్ బి.భూషణ్

డెంకాడ: మండలంలోని జొన్నాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో 586 మార్కులు సాధించిన పెనుమత్స భానుప్రకాష్ అనే విద్యార్థి నూజివీడు ట్రిపుల్ ఐటీలో, 569 మార్కులు పొందిన బూర్ల భూషణ్ అనే విద్యార్థి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.లక్ష్మి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది సదరు విద్యార్థులను అభినందించారు.

శుద్ధజల ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు వెంకటరమణ సిద్ధాంతి

విజయనగరం టౌన్: స్థానిక వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఇసరపు రామనారాయణ, లక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు, ప్రధానార్చకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి ఇసరపు శ్రీనివాస గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఏవో నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: వ్యవసాయంలో వస్తున్న సాంకేతికతనూ అందిపుచ్చుకోవాలని, అలాంటప్పుడే తక్కువ సమయంలో అధిక పని, దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.నీలిమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పెట్రోలుబంకు సమీపంలో ఉన్న అప్పలరాజు వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసిన డ్రోన్ పనితనాన్ని పరిశీలించేందుకు దానిని ఎగురవేశారు. డ్రోన్ల ద్వారా కూడా ఎరువులు, పురుగుమందులను పంటలపై పిచికారీ చేయవచ్చని, ఇలా డ్రోన్లను వినియోగిస్తే తక్కువ కాలంలో ఎక్కువ పొలాల్లో ఎరువులు జల్లవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో కొలువైన ఆంజనేయ స్వామికి మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం అనంతరం ఆంజనేయునికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ఆ తర్వాత స్వామి వారిని తమలపాకులు, సింధూరంతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే హనుమాన్ చాలీసా పఠనం సాగించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సన్మానం



మాట్లాడుతున్న సన్మాన గ్రహీత, వైద్యాధికారి రాజేష్‌వర్మ

పూసపాటిరేగ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేసి సింహాచలానికి బదిలీ అయిన రాజేష్‌వర్మను ఆస్పత్రిలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం పీహెచ్‌సీ అభివృద్ధికి ఆయన పాటుపడిన తీరును వక్తలు ప్రశంసించారు. ఎవరైనా విధి నిర్వహణలో అంకితభావంతో చేసిన సేవలే వారికి గుర్తింపుని తెస్తాయని వైద్యాధికారులు ప్రమీలాదేవి, కృష్ణచైతన్యలు అన్నారు.రాష్ట్ర స్థాయిలో పూసపాటిరేగ పీహెచ్‌సీకి గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తి ఆయన అని, శస్త్ర చికిత్సల్లో సైతం జిల్లాలోనే ఈ పీహెచ్‌సీని మొదటి స్థానంలో నిలిపారన్నారు. చాలాసార్లు ఉత్తమ పీహెచ్‌సీగా వచ్చిన అవార్డులే ఆయన వృత్తి పట్ల కనబరిచిన చిత్తశుద్ధి, అంకితభావానికి నిదర్శనమన్నారు. అనంతరం రాజేష్‌వర్మ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇవన్నీ చేయగలిగానని, తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజ్‌కుమార్, లక్ష్మీ శైలజ, వేదమణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీది ప్రజాపక్షం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'లో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



చొల్లంగిపేటలో ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ప్రభుత్వం మోసగిస్తున్న తీరును వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: అధికారం ఉన్నా లేకున్నా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమేనని, ముఖ్యమంత్రిగానైనా ప్రతిపక్ష నాయకుడిగానైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమమే కోరుకుంటారని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చొల్లంగిపేట, డి.కొల్లాం, గుణుపూరుపేట, గుణుపూరు, డెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్న ఆయనకు మహిళలు హారతులు పట్టి, తమ నాయకుడిపై ఉన్న అభిమానం చాటుకున్నారు. అనంతరం జరిగిన సభలో ప్రస్తుత కూటమి ప్రభుత్వ కుయుక్త రాజకీయాలను ఎండగడుతూనే అప్పటి వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరించారు. ఎన్నికల సమయంలో ఓట్లు, అధికారమే లక్ష్యంగా కూటమి నాయకులు లేనిపోని హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు మరిచారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు మేనిఫెస్టోను ఓ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి మరీ అందులోని హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి కూటమి అయితే మేనిఫెస్టోను ఎప్పుడో చెత్తబుట్టలో పడేసి ఉంటుందన్నారు. అందుకే అధికారం చేపట్టి ఏడాది కాలం దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఇచ్చిన ఒకట్రెండు పథకాలు కూడా ఎంతోమంది అర్హులకు దక్కకుండా పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అయితే అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిందన్నారు. ఇప్పుడైతే తమ పార్టీ వారా కాదా అని చూసుకుని పథకాలు ఇస్తున్నారన్నారు. అప్పట్లో జగనన్న సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం తీసుకువచ్చారని, ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేశారన్నారు. మరోవైపు నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా తయారు చేసి శభాష్ అనిపించుకున్నారని గుర్తు చేశారు. ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా జగనన్న పాలన కొనసాగించారన్నారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

అక్రమాలను ప్రశ్నిస్తే కేసులా?

ఇప్పటికీ ఏ గ్రామం వెళ్లినా జగనన్న చేసిన మంచి, అభివృద్ధే కనిపిస్తోందన్నారు. కూటమి గద్దెనెక్కిన దగ్గర నుంచి రక్తపాతమే కనిపిస్తోందని, ఎక్కడ చూసినా రాజకీయ హత్యలు, దాడులేనన్నారు. కూటమి సర్కారుదీ అదే తీరు.. ఆ పార్టీల నాయకులదీ అదే తీరని విమర్శించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అయితే ఈ ప్రాంతంలో లేని కొత్త సంప్రదాయాలకు తెరతీస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా వారిచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీసినా, అన్యాయాన్ని ఎదురించినా, అక్రమాలను ప్రశ్నించినా తమపై పోలీస్ కేసులు పెడుతున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని హితవు పలికారు. గెలిపిస్తే వంద రోజుల్లో వంద కంపెనీలు తీసుకువచ్చి, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఏపీ ఉద్యోగాలు, ఎవరికిచ్చారో ఉద్యోగాలు చెప్పాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇదే చొల్లంగిపేటలో చిన్నచిన్న గోతులతో ఉన్న రోడ్డులో వరినాట్లు వేసి రోడ్డు బాగోలేదని నిరసన తెలిపారని, మీరొచ్చిన తర్వాత అదే రోడ్డును ఎందుకు బాగుచేయలేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అయినా, ఆ పార్టీల నాయకులైనా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, హామీలు అమలు చేసేంతవరకు వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, నాయకులు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, రొంగలి కనకసింహాచలం, కరుమజ్జి త్రినాధరావు, కోరాడ కోటినాయుడు, పతివాడ కృష్ణవేణి, బుజ్జిరాజు, కోరాడ కనకరాజు, లెంక లక్ష్మణరావు, చిట్టిరాజు, ఎర్ర శ్రీనివాసరావు, రేగాన శ్రీనివాసరావు, తొత్తడి శ్రీను, పైల ముత్యాలరావు, బండుకొండ చిన్న, రామునాయుడు, మండల సత్యం, బమ్మిడి వెంకటరమణ, పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

• పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రం గ్రంథాలయంలో జాతీయ కవి గరిమెళ్ల సత్యనారాయణ కవితలు పేరిట ప్రచురించిన పుస్తకాన్ని స్థానిక స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.సవరమ్మ మంగళవారం ఆవిష్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రత్నాల బాలకృష్ణ సంపాదకత్వం వహించగా, అరసం ప్రచురించిన ఈ పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలని వక్తలు కోరారు. దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా గరిమెళ్ల తన జీవితం చివరి వరకు సాహిత్యం ద్వారా పోరాడారని, మాకొద్దీ తెల్లదొరతనం అనే గేయంతో దేశ ప్రజల్లో చైతన్యం నింపి బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన సాహితీయోధుడు గరిమెల్ల అని కొనియాడారు. ఇదిలా ఉండగా, అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్ చలం సంపాదకత్వం వహించిన జాతీయాలు–సామెతలు' పుస్తకాన్ని అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ విడుదల చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎస్ జయపాల్‌రావు, ఎస్.శ్రీనివాసరావు, బద్రికూర్మారావులు పుస్తక సమీక్ష చేశారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులు

విజయనగరం గంటస్తంభం: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసనకు దిగారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు..ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు కనీసం వేతనం కింద రూ.21 వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు చెల్లించాలని, అది కూడా ప్రతినెలా పదో తేదీ లోపు ఇవ్వాలని, సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. యూనియన్ నాయకుడు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని ఆశించామని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు లేకుంటే ఎలా బతకాలన్నారు. థర్డ్ పార్టీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికుని వాటాతో సమానంగా యాజమాన్యం వాటా చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేదన్నారు. నగరపాలక సంస్థ టెండర్లలో థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రాజు, ఎస్.రామునాయుడు, కె.ఆదినారాయణ, ఉత్తరనాయుడు, రాంబాబు, గౌరీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు కలిగి ఉండడం ప్రధానం



మాట్లాడుతున్న బ్రహ్మకుమారీ మాధురి

విజయనగరం అర్బన్: విద్యార్థులు చదువుకున్న రోజుల నుంచే సాంకేతిక నైపుణ్యాలు కలిగి ఉండడం ప్రధానమని బ్రహ్మకుమారీ మాధురి తెలిపారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. ఏఐ మరియు డిజిటల్ నైపుణ్యాలు అనే అంశంపై కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, శాంతి కలిగి ఉండాలని, స్వయంగా ఎదగాలన్న ఆలోచన దానికి తగిన సాధన ఉండాలని తెలిపారు. మారుతున్న ప్రపంచానికి కావాల్సిన నైపుణ్యాలు ఉంటే అవి మీ కలలకు రెక్కలని, వాటిని బలంగా నిర్మించుకోవాలన్నారు. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకుని, సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

• నగరం.. జల దిగ్బంధం!



వరదనీటిలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం



ప్రధాన రోడ్డులోకి చేరిన వర్షపునీరు



వరదనీటిలో పాతబస్టాండ్ రోడ్డు



రాజీవ్ క్రీడా ప్రాంగణానికి వెళ్లే మార్గం ఇలా..

విజయనగరం జల దిగ్బంధంలో చిక్కుకుంది. జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. గంటస్తంభం, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రాజీవ్ క్రీడా ప్రాంగణానికి వెళ్లే దారిలో భారీగా వరదనీరు ఉండిపోవడంతో ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపునీరు వచ్చేయడంతో వారు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. కొన్ని గంటల పాటు శ్రమించి, ఇళ్లల్లోకి చేరిన నీటిని బయటకు తోడేసి ఊపిరిపీల్చుకున్నారు. వర్షం కారణంగా కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంధకారం నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పేదరికం తగ్గింపు ప్రణాళికలపై శిక్షణ

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీసీ కేంద్రంలో డీఆర్‌డీఏలోని పనిచేస్తున్న ఏపీఎంలు, సీసీలకు గ్రామ పేదరికం తగ్గింపు ప్రణాళికల తయారీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామ స్థాయిలోని పేదరికాన్ని రూపుమాపేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న దానిని ప్రాజెక్టు డైరెక్టర్ కె.సావిత్రి తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంలు ఎ.చిరంజీవి, రాజ్‌కుమార్, ఏపీఎం విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: ప్రతి మహిళ తమ స్మార్ట్ ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ సౌమ్యలత సూచించారు. నగరంలోని అపెక్స్ విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, దాని ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎవరైనా ఆపద సమయంలో ఉన్నప్పుడు తక్షణ రక్షణ కోసం ఈ శక్తి యాప్‌ను ఆశ్రయిస్తే క్షణాల్లో పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారని ఆమె తెలిపారు. యువత అంతా ఫ్యాషన మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి గూర్చి ఏదైనా సమాచారం తెలిస్తే 100 లేదా 112 నంబర్‌కు గానీ 1972కు గానీ డయల్ చేసి విషయం తెలియజేయాలన్నారు.

తిలక్ సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: స్థానిక హోటల్ మయూరాలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ప్రథమ పార్లమెంట్ సభ్యులు కందాల సుబ్రహ్మణ్య తిలక్ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎస్ఎన్ రాజు, యార్లగడ్డ బాబూరావు, నాలుగెస్సుల రాజులు హాజరై, తిలక్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. మంచి విలువలు కలిగిన వ్యక్తి తిలక్ అని, ఆయనను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం పేద విద్యార్థులకు పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో తిలక్ కుమార్తె అమల, సాయిబాబా, విజయరామకృష్ణ, ఎర్నాయుడు, వాసు, ఆదిత్య, మణిమాల పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ బొగ్గులదిబ్బలో కొలువైన శ్రీపైడితల్లి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి అర్చకులు, వేద పండితులంతా వేదమంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భక్తులు పసుపు, కుంకుమలతో పాటు ఘటాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ చీఫ్ మేనేజర్ సులేఖరాణి

విజయనగరం ఫోర్ట్: పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ఆ పథకం విస్తృత స్థాయిలో అమలు జరగాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, సోలార్ ఎనర్జీ అధికారిణి బి.సులేఖరాణి అన్నారు. మండల పరిధిలోని దాసన్నపేటలోని విద్యుత్ భవన్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు నేతృత్వంలో విద్యుత్ శాఖ, బ్యాంకు అధికారులతో మంగళవారం జరిగిన సమన్వయ సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బ్యాంకర్లు, సోలార్ వెండర్లు, విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సోలార్ విద్యుత్ వినియోగానికి ఆసక్తి కనబరిచే వారికి సబ్సిడీపై అందించే పరికరాలు, రుణాలు, సాంకేతిక సాయం వంటి అంశాలపై చర్చించారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అవసరమైన బ్యాంకు రుణ సదుపాయాలు పర్యవేక్షణకు ఎస్‌బీఐ తరఫున జిల్లా పరిధిలో ఓ నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణమూర్తి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య తనిఖీలు



కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యురాలు

విజయనగరం: స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ స్వర్గీయ అవనాపు సూరిబాబు జయంతి సందర్భంగా నగరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. విజయనగరానికి చెందిన నాగవంశ సంక్షేమ సంఘం, స్వామి కంటి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరానికి మొత్తం 476 మందికి కంటి రోగులు హాజరు కాగా వారి కళ్లను వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. నేత్ర వైద్య తనిఖీలకు హాజరైన వారిలో 142 మందికి నేత్ర శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అవనాపు విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు మంచు రవళి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ప్రేమ సమాజంలోని వృద్ధులకు అన్నదానం, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అంతకుముందు సూరిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ళ గౌరీశంకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా



మాట్లాడుతున్న సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ వీఎస్ఆర్ నాయుడు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పెన్షనర్లకు నష్టం కలిగించే పెన్షన్ వాలిడేషన్ సవరణ జీవోను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు మంగళవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వ పెన్షనర్ల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కొత్త బిల్లు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వ పెన్షనర్లకు కూడా నష్టమేనన్నారు. అలాగే వెంటనే ఎనిమిదో పే కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఐదేళ్లకు రివిజన్ అందించి, బకాయిపడిన డీఏ డీఆర్‌లను చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సమగ్ర ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలన్నారు. ఎస్‌పీఎస్, యూపీసీ విధానాలను నిలిపివేయాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా చేపడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నారాయణ, కోశాధికారి సూర్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ వీఎస్ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

• అలరించిన నృత్య ప్రదర్శన



విజయనగరం జిల్లా కేంద్రంలోని పైడితల్లి చదురుగుడి వద్ద ఉన్న ఆధ్యాత్మిక కళా వేదికపై తమ్మిన సాహితీ ప్రియ బృందం మంగళవారం వారు చేసిన భరతనాట్య నృత్య ప్రదర్శన అలరించింది. నాట్యం ఆద్యంతం చూపరులను మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం బృంద సభ్యులను నిర్వాహకులు సన్మానించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం